# చీకటి

– సురేష్

శారద ధనుంజయరావు గారింటికెళ్లేసరికి, అందరూ దేని గురించో సీరియస్‌గా చర్చించుకోవటం కనిపించింది. తనకి సంబంధం లేని దానిలా నడవబోతూన్న శారదను చూసి, ''టీచర్! ఓ అయిదు నిముషాలు కూర్చుంటారా'' అంది మానస.

దేనికో అర్థంకాక నిలబడిన శారదతో, మానస నవ్వుతూ ''నాన్నగారికి ఏదో ధర్మ సందేహం వచ్చిందట. కూర్చో'' అంది.

తప్పదన్నట్లు కూర్చుంది.

ధనుంజయరావు అందరివైపు ఒకసారి చూసి, ''చీకటంటే ఏమిటి'' అనడిగాడు.

అసందర్భంగా అడిగిన ఆ ప్రశ్నకు అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

''చీకటంటే న్యాయబద్ధంగా చివర వరకూ వాదించినా, నిర్దోషికి శిక్ష పడటమే అతని జీవితంలో పెద్ద చీకటి'' అన్నాడు లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్న పెద్ద కొడుకు.

''నేరం చెయ్యకపోయినా, పరిస్థితుల ప్రభావం వలన చేసారని ఒప్పించడమే చీకటి'' అన్నాడు ఇన్స్‌పెక్టర్‌గా చేస్తున్న రెండవ కొడుకు దాదాపు పెద్దవాడితే ఏకీభవిస్తూ.

''వాతావరణంలో, భూమి, సూర్యుడు, చంద్రుడుల మధ్య వచ్చే సాధారణ ప్రక్రియలలో ఒక భాగమే చీకటి'' అన్నాడు అప్పుడే మెడిసిన్ పూర్తి చేసిన మూడో కొడుకు.

ధనుంజరాయువు వీళ్ల సమాధానాలతో సంతృప్తి చెందలేదు.

మానస శారదవైపుకు తిరిగి ''నువ్వేమీ మాట్లాడవేంటి?'' అంది.

శారద లేచి నిలబడి, ''చీకటంటే వెలుగు అదృశ్యమవటం'' నాటకీయంగా అనేసి, ఫక్కున నవ్వుతూ పిల్లలకు ట్యూషన్ చెప్పటానికి లోపలకు నడిచింది.

★ ★ ★

ధనుంజరాయువు ఎం.ఎల్.ఏ.గా పదవిలో ఉండటం వలన అతను నిత్యం బిజీగానే ఉంటాడు. ముగ్గురు కొడుకులు, ఒకేఒక కూతురు ఉండటం వలన అందర్నీ ఉన్నత స్థితుల్లోకి వచ్చేటట్లు చేసాడు. మానసకు శారద క్లాస్‌మేట్ అవటం వలన ధనుంజయరావు మనవళ్లకు ట్యూషన్ చెప్పటానికి, మానస బలవంతం మీద ఒప్పుకుంది. నిజానికి, ఇంట్లో ఖాళీగా ఉంటున్న మానస ఆ పని చెయ్యొచ్చు. స్నేహితురాలి ఆర్థిక పరిస్థితి గురించి పూర్తిగా తెలియటం వలన, శారదకు సహాయం చేసినట్లుగా ఉంటుందనే ఉద్దేశంతో, ట్యూషన్స్ చెప్పడానికి ఒప్పించింది. శారద కూడా 'డబ్బు' అవసరంతో కాదనలేదు. ఇంటి దగ్గర చెప్పే ట్యూషన్స్ కంటే, ఇంటికెళ్లి ప్రత్యేకంగా ట్యూషన్స్ చెప్పటం ద్వారా డబ్బు ఎక్కువొస్తుందనే ఆలోచన కూడా ఆమె మానస ఇంటిలో ట్యూషన్స్ చెప్పడానికి ఒక కారణం. శారద మొదట్నుంచీ తెలివైన అమ్మాయి అవడంతో, ఆమె గ్రాడ్యుయేషన్ ఫస్ట్‌క్లాస్ సాధించింది. అర్హతకు తగిన ఉద్యోగాలివ్వటం ఈ దేశ చరిత్రలోనే లేదు కనుక ఆమె మామూలు అమ్మాయిగానే మిగిలిపోయింది. ధనుంజయరావు గారింట్లో మొదట్లో బెరుగ్గా ఉన్నప్పటికీ, మానస సహకారంతో ఆమె స్వేచ్ఛగా ఉండగలుగుతూంది.

పిల్లలకు ట్యూషన్స్ చెప్పి బయటకు వస్తుంటే, మంచం మీద పడుకొని పుస్తకం చదువుకుంటున్న శ్రీకర్ కనిపించాడు. తనెప్పుడూ చూసినా ఏదో పుస్తకం చదువుకునే శ్రీకర్ మీద ఆమెకు గౌరవభావం ఉంది.

★ ★ ★

ఆ మర్నాడు ధనుంజయరావు గారింటికెళ్లేసరికి ఇంట్లో ఎవరూ లేరు. ఆమె ఆశ్చర్య పడుతూ ఇంటిలోకి ప్రవేశించింది. శ్రీకర్ ఏదో పుస్తకం చదువుకుంటున్న వాడల్లా, అలికిడికి తలతిప్పి ''మీరా! రండి'' అన్నాడు.

ఆమె ఇబ్బందిగా లోపలకు అడుగు పెట్టింది.

''ఇంట్లో ఎవరూ లేరా?''


''మామయ్యకు హార్ట్ ఎటాక్ వచ్చిందని అందరూ హడావిడిగా వెళ్లిపోయారు. టెన్నిస్ నుంచీ నేనొచ్చేసరికి ఎవరూ లేరు. బహుశా ఈరోజు ట్యూషన్‌కు హాలిడే అనుకుంటా'' అమె నవ్వి ''నేషనల్ హాలిడే అన్నమాట'' అంది.

''చెప్పండి విశేషాలు'' అన్నాడు.

''ఏం ఉంటాయి. మామూలే''.

''ఎప్పుడూ ట్రిగోనామెట్రీ, జామెట్రీ తప్పా మాట్లాడటానికి ఇంకేం సబ్జెక్టు ఉండదా? ఎలా ఉన్నాయి మీ ట్యూషన్స్?''

''ఇంటి దగ్గర ఓ ఇరవైమంది పిల్లలొస్తారు. వాళ్ల



ఇరవై మందికి ఇచ్చేదానికంటే, మీ ఇంట్లో నలుగురికి ఇచ్చేది ఎక్కువ కనుక ప్రస్తుతానికి ఫరవాలేదు'' అంది నవ్వుతూ.

''నిన్ను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుంది శారదా. ఏ విషయానికి అంత ప్రాముఖ్యం ఇవ్వవు''. (బతకటానికి ఉన్న మార్గాలను వినియోగించుకోవడమే నాకు తెలిసిన చదువు. సమస్యల గురించి, ఇతర విషయాల గురించి ఆలోచించి అనవసరమైనటువంటి టెన్షన్ క్రియేట్ చేసుకోను''.

''నీ గురించి చెప్పు శారదా''.

''అంతా తెలుసుగా. సినిమా కథ లాంటిది. రిటైరైన తండ్రి. ఉద్యోగం దొరకని అన్నయ్య. పెళ్లి కాని అక్క'' అంది నవ్వుతూ.

''ఇన్ని సమస్యలున్నా ఇంత స్వచ్ఛంగా నవ్వుతూ ఎలా ఉండగలవు? నాకైతే మెడిసిన్ సీట్ వస్తుందా? రాదా? అనే సమస్య, వచ్చిన తరువాత పూర్తి చెయ్యగలనా? అనే సమస్య . ఇప్పుడు ప్రాక్టీసు చెయ్యగలనా? లేనా? అనే సమస్య, ఇన్ని సమస్యలతో బాధపడే నేను, నిన్ను చూసి ఎప్పుడూ థ్రిల్‌గా ఫీల్ అవుతుంటాను'' అన్నాడు.

అప్పటికే చాలా సమయం అవటంతో, ''వెళ్లొస్తాను'' అని లేవబోయింది.

''కూర్చో శారదా'' అని చెయ్యి పట్టుకున్నాడు శ్రీకర్.

తనని మరికొంతసేపు ఉంచటానికి కాకతాళీయంగా పట్టుకున్నాడేమో అనుకుంది మొదట. కానీ అతను చెయ్యి వదిలే ప్రయత్నం చెయ్యక పోయేసరికి అతను కావాలనే పట్టుకున్నాడని అర్థమైంది.

''వదులు శ్రీకర్'' అంది తీక్షణంగా చూస్తూ.

''శారదా! ప్లీజ్ ఒక్కసారి...''

''ఏమిటి ఒక్కసారి'' అంది అయోమయంగా.

''నువ్వంటే నాకు చాలా ఇష్టం శారదా! నా మనస్సులో ఫీలింగ్స్ ఎలా చెప్పాలో తెలియటం లేదు''.

''మనస్సులో ఫీలింగ్స్ చెప్పటానికి చెయ్యి, చీర పట్టుకోనవసరం లేదు'' అంది కటువుగా.

''ఒక్కసారికి ఏమీ కాదుగా''

అతనంటే అసహ్యం వేసింది శారదకు.

''శ్రీకర్! ఈ ఇంటికి నేనెప్పుడొచ్చినా నువ్వెలా ఉండేవాడివో తెలుసా? ఎప్పుడూ ఏదో పుస్తకం చదవటం, మాట్లాడినా నీ సబ్జెక్ట్ గురించే మాట్లాడటం... నీ ప్రపంచంలో నువ్వుండే వాడివి. ఎప్పుడు నిన్ను చూసినా, ఈ అబ్బాయికి చదువు తప్ప ఇంకేం ఉండదా? అని ఆశ్చర్యపోయేదాన్ని. నన్నూ నీలా చదివిస్తే, మంచి స్థితిలో ఉండేదాన్ని కదా, అని అనుకునేదాన్ని. కానీ అటువంటి అందమైన భావాన్ని నువ్వు పోగొట్టేవ్. నువ్వు కూడా పబ్లిక్‌లో అమాయకమైన అబ్బాయిగా, ఎవరూ లేకపోతే అందర్లాగే చీరలు పట్టుకునే సంస్కార హీనుడవని ఇప్పుడే తెలిసింది. ఇంట్లో ఎవరూ లేకపోయినా నేను నీ గదిలోకి ఎందుకొచ్చానో తెలుసా? నా మనస్సులో ఎటువంటి దురుద్దేశం లేదు కనుక, అది నీలో ఉండదనే నమ్మకంతో. నా ఇన్నాళ్ళ నమ్మకాన్ని నువ్వు పాడు చేసావు. ఐ హేట్ యు'' అంది ఆవేశంగా.

''నువ్వంటే నాకు చాలా ఇష్టం శారదా''

''అయితే పెళ్ళి చేసుకుంటావా?''

అతను అవాక్కయి చూస్తుండిపోయాడు.

ఆమె విషాదంగా నవ్వి, ''చేసుకోవు. ఎందుకంటే చేసుకోవటానికి నీ స్టేటస్ ఒప్పుకోదు. నువ్వు డాక్టర్‌వి. స్టేటస్... డబ్బు కావాలి. డబ్బున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుని లగ్జరీ లైఫను ప్రారంభిస్తావు. అంతేగాని నీ ఇంటిలో 'ట్యూషన్స్' చెప్పుకునే మామూలు అమ్మాయిని నువ్వు పెళ్ళిచేసుకోవు. నీ అంతరంగం దానికి ఒప్పుకోదు. జీవితమంటే ఏమిటో తెలియని అమాయకమైన అమ్మాయైతే, ఈ పాటికి నీ కౌగిలిలో చేరిపోయి, రేపట్నుంచీ అబార్షన్ గురించి హాస్పిటల్ చుట్టూ తిరిగేది. ఇంకెప్పుడూ ఇలాంటి వేషాలెయ్యకు'' అని వెనుతిరిగింది.

ఎప్పుడొచ్చారో తెలీదు గాని మొత్తం కుటుంబ సభ్యులంతా అక్కడే ఉన్నారు. ''ఎంతకాలం నుంచీ మా వాడిని ట్రాప్ చేస్తున్నావు?'' అంది ధనుంజయరావుగారి భార్య జయ సీరియస్‌గా.

అనుకోని అభియోగానికి ఆమె తెల్లబోయింది.

''నేను ట్రాప్ చేస్తున్నానా?''

''డబ్బు... స్టేటస్ ఉన్న అందమైన డాక్టర్ చదివిన అబ్బాయి ఉంటే, ఎవరైనా ఇలానే ప్రవర్తిస్తారు. కానీ మా ఇంటిలో పని చేస్తూ మావాడినే ట్రాప్ చెయ్యటానికి ప్రయత్నించావంటే నువ్వు చాలా తెలివైన దానివి. ఇంకెప్పుడూ ఈ ఇంటి ఛాయలకు రాకు''.

తప్పంతా తన మీదకు తోసెయ్యటాన్ని ఆమె సహించలేకపోయింది.

''చేసిందంతా మీ అబ్బాయి, చేతనైతే మీ అబ్బాయికి బుద్ధి చెప్పండి'' అంది తీవ్రంగా.

''వాడేం చేసాడు. వాడ్ని బుట్టలో వేసుకోవటానికి ప్రయత్నించింది నువ్వు. మేమెవ్వరం లేమని తెలిసినా వాడి రూంలోకి వెళ్ళావంటే ఏమిటి దానర్థం?''

ఆవిడకు అంతా తెలుసు. కొడుకు తప్పు చేసాడని తెలుసు. ట్యూషన్స్‌కు వచ్చే తాను ఎటువంటిదో ఆమెకు తెలుసు. కానీ, ఈ సమయంలో దీన్నంతటినీ ఆవె మొగ్గగానే తుంచెయ్యటానికి నిర్ణయించుకుందనీ, అందుకే తప్పు తన మీదకు తోసేస్తుందనీ, కొడుకు పొరపాటున తనెక్కడ పెళ్ళి చేసుకుంటాడేమోననే భయంతో, దీన్ని తెలివిగా ఉపయోగించుకుంటోందని అర్థమైంది. ఆ కుటుంబం మీదే అసహ్యం వేసింది.

ధనుంజయరావు గారి దగ్గరికి వచ్చింది. ''చీకటంటే ఏమిటని అడిగారు గుర్తుందా? మన మనసులో మనకు తెలియకుండా కృత్రిమంగా దాచుకునే నీచత్వమే చీకటి. మీరు పదవిలో ఉన్నారు. ఎవరైనా సన్మాన సభలను పిలిస్తే, 'వరకట్నం నశించాలి' 'కులాంతర వివాహాలకు ప్రోత్సహించాలి' అని ఉపన్యాసాలిస్తారు. మీ ఇంటికెవరొచ్చినా, మీ అబ్బాయిని చూసి 'ఈ అబ్బాయెంత బుద్ధిమంతుడు? ఎప్పుడూ పుస్తకాలతోనే ఉంటాడు' అనుకుంటారు. ఎవరూ లేకపోతే చేతులు పట్టుకుని 'నువ్వంటే ఇష్టం' అంటాడు. మీ భార్య మహిళా మండలి మీటింగుల్లో, స్త్రీ అభ్యుదయానికి ప్రోత్సాహమివ్వాలి, స్త్రీ స్వేచ్ఛ పరిరక్షణకు ఉద్యమించాలి అని ఉపన్యాసాలిస్తారు. ఇక్కడ జరిగిందంతా ఆవిడకు తెలిసినా, తన ఉపన్యాసాల వేడిని ఇంటి దగ్గర మరచిపోతారు. జరగరాని దేదైనా జరిగి నేను, స్టేషన్‌కెళితే, ఈ జ్యూరిస్ డిక్షన్ మీ అబ్బాయిదే కనుక, కేసు మాఫీ చేయటానికి ప్రయత్నిస్తారు. అవీ అవ్వకపోతే డిఫెన్స్ లాయర్ మీ అబ్బాయి కనుక అసలు నేనే మీ అబ్బాయిని రేప్ చేయటానికి ప్రయత్నించావని వాదిస్తారు. అదీ అవ్వకపోతే, మీ పదవి... అధికారం... డబ్బు వీటన్నింటితో జడ్జిని కొంటారు. చీకటంటే అది. చీకటి అనేది ఎక్కడో ఉండదు. అది మన మనస్సులోనే ఉంటుంది. మన మనస్సు పొరల వెనక దాక్కుని ఉండే కృత్రిమత్వమే చీకటి. సన్మాన సభల్లో మీరు, ఉపన్యాసాల్లో మీ ఆవిడ, చట్టం పరిరక్షణలో మీ కొడుకులు, సమాజంలో గొప్ప స్థానంలో ఉన్న మీ అందరి అంతరంగాల్లో, అపారమైన చీకటి ఉంది. అంతులేని గాఢాంధకారం నిండి ఉంది. అది ఎప్పటికీ తొలగిపోదు. ఎందుకంటే తొలగించుకునే ఆలోచనంటూ మీకు రాదు కనుక'' అని ఆవేశంగా బయటకు నడిచింది శారద.

★




## పీడ

''రాణీ... నన్ను చూస్తే నీకేమని పిస్తుంది?'' ప్రేయసి నడిగాడు ప్రియుడు.

''ఎంత త్వరగా నీ పీడ వదలించుకోవాలా? అనిపిస్తుంది'' బదులిచ్చింది ప్రియురాలు.

-జి.డి.వి. ప్రసాదరావు (కిర్లాడ)



## బిజీ రవళి

రోజాకు పెద్దగా చిత్రాలు లేకపోవడం, రమ్యకృష్ణ హిందీలో కూడా చేస్తుండటం, నగ్మాకు బేరాలు (సినిమా అవకాశాలు) లేకపోవడం, పెళ్ళిసందడి హిట్టవ్వడం... ఇవన్నీ ఇప్పుడు రవళిని బిజీ ఆర్టిస్టుని చేశాయి. రవళిగా మారిన అప్సర ఇప్పుడు చాలా చిత్రాల్లో నటిస్తోంది.

-విజయార్కా

